క్లుప్తంగా

కొండగట్టులో ఎమ్మెల్యే రవిశంకర్ పూజలు



కొండగట్టులో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

కొండగట్టు: చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తన పుట్టినరోజు సందర్భంగా కొండగట్టు ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి అనంతరం గోత్రానామాలు చదివి ఆశీర్వచనం అందించారు. ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్ శాలువతో సత్కారించి ప్రసాదం అందజేశారు. ఆయన వెంట ముత్యంపేట సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి, జెడ్పీటీసీ కొండ పల్కాల రాంమోహన్‌రావు ఆలయ ప్రధాన అర్చకులు రామకృష్ణ, ఉపప్రధాన అర్చకులు చిరంజీవస్వామి స్థానాచార్యులు కపిందర్ సూపరింటెండెంట్ సునీల్ శ్రీనివాస శర్మ ఉన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

రాయికల్: పట్టణంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పదవి ఎస్సీ మహిళ మారంపల్లి రాణికి కేటాయించడంపై హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం పట్టణంలోని 3వ వార్డులో సీఎం కేసీఆర్, ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ చిత్రపటాలకు దళిత సంఘాల నాయకులు, మహిళలు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు విక్రమ్, సురేశ్, లక్ష్మీనారాయణ, మహిపాల్, శ్రీను, గంగవ్వ, మంజుల, శాంత, భూమిక, రజిత పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్

రాయికల్: పట్టణంలోని అన్ని వార్డుల్లో సీసీరోడ్లు, మురికికాలువలు వంటి మౌలిక వసతుల కల్పనకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ పట్టణంలో విద్యుద్దీపాల సమస్య తీవ్రంగా ఉందని, సమస్య పరిష్కరించాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు మాట్లాడుతూ పట్టణంలో పలు అభివృద్ధి పనుల కోసం సీఎస్ఆర్ ఫండ్స్ మంజూరయ్యాయని తెలిపారు. ఎమ్మెల్యే సహకారంతో పట్టణాన్ని సుందరీకరణ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ సంతోష్‌కుమార్, వైస్ చైర్మన్ రమాదేవి, కౌన్సిలర్లు,కో–ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

మున్సిపల్‌లో కౌన్సిల్ సమావేశం



సమావేశంలో అధికారులు, పాలకవర్గం

ధర్మపురి: మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశానికి కమిషనర్ రమేశ్‌తో పాటు కౌన్సిలర్లు హాజరయ్యారు. సమావేశంలో వివిధ సమస్యలకు సంబంధించిన పనులపై మొత్తం 24 అంశాలను సభ్యులు ఆమోదించారని తెలిపారు. వాటిలో వేలంలు, బోర్‌వెల్ సామగ్రి కొనుగోలు, మంచినీటి పైపులైన్ల లీకేజీలు, గేట్‌వాల్ రిపేర్లు, పారిశుద్ధ్య కార్మికులకు రేన్‌కోట్లు తదితర అంశాలను ఆమోదించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రామన్న, సభ్యులు తదితరులున్నారు.

ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

పెగడపల్లి: అక్టోబర్ 1–2023 వరకు 18 ఏళ్లు నిండే వారు కూడా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ కృష్ణచైతన్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలనే ఎన్నికల సంఘం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టిందని, ఓటు నమోదు,చేర్పులు, మార్పులు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

• ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం స్థానిక శుభమస్తు గార్డెన్స్‌లో జరిగింది. ప్రభుత్వం చేపట్టే ప్రతి పనిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. అనంతరం రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచంద్ మృతికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, మాజీ చైర్మన్ దేశాయి తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపులకు భవనం కేటాయించాలి

మున్నూరుకాపులకు భవనం కేటాయించాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు మున్నూరుకాపు సంఘం నాయకులు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్నూరుకాపు విద్యార్థుల కోసం హాస్టల్, సంఘ భవనం నిర్మాణం కోసం స్థలం కేటాయించి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్యే స్పందించి మంత్రి దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు హరి అశోక్‌కుమార్, మల్లికార్జున్, కోల శ్రీనివాస్, రాజిరెడ్డి, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, వెంకట్ పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

జగిత్యాలరూరల్: సీఎం సహాయనిధి నిరుపేదలకు వరంలాంటిదని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం గ్రామానికి చెందిన ఉరుముట్ల అనూష కిడ్నీ వ్యాధితో బాధపడుతుండగా కిడ్నీ మార్పిడి కోసం సీఎం సహాయనిధి నుంచి రూ.3 లక్షల ఎల్‌వోసీని కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బోనగిరి నారాయణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన జిల్లా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు

జగిత్యాలజోన్: ఇటీవల జిల్లా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులుగా నియమితులైన న్యాయవాదులు కట్కం చంద్రమోహన్, రాచకొండ విజయ్‌కృష్ణ మర్యాదపూర్వకంగా శుక్రవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కలిశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాటిపల్లి శ్రీపాల్‌రెడ్డి, ఏజీపీ నరేందర్, అడిషనల్ పీపీలు మురళీ, మల్లికార్జున్, న్యాయవాదులు పాల్గొన్నారు.

చేసిన అభివృద్ధి పనులు ప్రజలకు చెప్పాలి

• కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు



హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

ఇబ్రహీంపట్నం: చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు చెప్పాలని ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు అన్నారు. వివిధ కుల సంఘాల భవనాల నిర్మాణానికి ఏసీడీపీ నిధులు రూ. 50 లక్షలు మంజూరు కాగా, ప్రొసీడింగ్ పత్రాలను కుల సంఘ సభ్యులకు అందజేశారు. అనంతరం రూ.10 కోట్లతో మండలంలో వివిధ గ్రామాలకు వెళ్లే దారుల్లో హైలెవల్ వంతెనల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ప్రతి కుల సంఘ భవనానికి నిధులు మంజూరు చేస్తున్నామని, మిగిలిన వాటికి కూడా నిధులు మంజూరు చేస్తానన్నారు. మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్లలో హైలెవల్ వంతెనల నిర్మాణానికి భారీగా నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో స్థలం ఉన్న వారికి ఇళ్లు కట్టుకునేందుకు రూ. 3 లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. 2వ విడత 1100 మందికి అర్హులైన వారికి దళితబంధు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. దళితబంధు పథకంలో గాని, కుల వృత్తులకు రూ. 1 లక్ష మంజూరు పథకంలో గాని ఎవరైనా లంచాలు అడిగితే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జాజాల భీమేశ్వరి, జెడ్పీటీసీ భారతి, ఆర్అండ్‌బీ డీఈ వెంకటరమణ, ఎంపీడీవో ప్రభు, సర్పంచులు నేమూరి లత, దొంతుల శ్యామల, శ్రీనివాస్, గుంటి లక్ష్మి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు పొనకంటి వెంకట్, వైస్ ఎంపీపీ నొముల లక్ష్మారెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యుడు ఎలేటి చిన్నారెడ్డి, నాయకులు సురేశ్ రెడ్డి, కమటం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సాయిచంద్‌కు ఘన నివాళి



సంతాపసభలో పాల్గొన్న జెడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్ రావు

కోరుట్ల: తెలంగాణ గాయకుడు, గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచంద్ మృతిపై దళిత సంఘాల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ఈ మేరకు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. హైదరాబాద్‌లో సాయి చంద్ పేరున స్మృతి వనం ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘాల నియోజకవర్గ అధ్యక్షుడు ఈయాల శోభన్, కౌన్సిలర్ మోర్తాడ్ లక్ష్మీనారాయణ, కల్లూర్ సర్పంచ్ వంతడుపుల అంజయ్య, నాయకులు పాల్గొన్నారు.

రాయికల్: అకాల మరణం చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచంద్‌కు శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ మోర హన్మండ్లు మాట్లాడుతూ సాయిచంద్ తెలంగాణ ఉద్యమంలో తన పాటలతో ఉద్యమాన్ని ఉధృతంగా ఉర్రూతలూగించారన్నారు. ఆయన మృతి తీరని లోటన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రమాదేవి, కౌన్సిలర్లు నాయకులు పాల్గొన్నారు.

సాయిచంద్ మృతి బీఆర్ఎస్‌కు తీరని లోటు

కథలాపూర్: రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచందు మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని జెడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్‌రావు అన్నారు. శుక్రవారం మేడిపెల్లిలోని పీఎస్ఆర్ గార్డెన్‌లో సాయిచంద్ సంతాప సభ ఏర్పాటు చేశారు. పార్టీ కోసం, తెలంగాణ సాధన కోసం ఆయన చేసిన సేవలను గుర్తుచేశారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దావ సురేశ్, అభిలాశ్ పాల్గొన్నారు.

ఉద్యోగ నియామక ప్రక్రియ ప్రారంభం

జగిత్యాల: పాఠశాల విద్యాశాఖలోని సమగ్ర శిక్షాలో కాంట్రాక్ట్ విధానంలో ఉద్యోగ నియామకాలు చేపట్టామని డీఈవో జగన్మోహన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. డాటాఎంట్రీ ఆపరేటర్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, అసిస్టెంట్ ప్రోగ్రామర్లు, ఐఈఆర్పీలు తదితర పోస్టులను భర్తీ చేసేందుకు 2019 నవంబర్‌లోనే విద్యాశాఖ నోటిఫికేషన్ జారీచేసిందని గుర్తుచేశారు. డిసెంబర్‌లో రాత పరీక్ష నిర్వహించి తాజాగా ప్రభుత్వం ఆమోదం తెలపడంతో పోస్టులను భర్తీ చేసే ప్రక్రియ ప్రారంభించామని పేర్కొన్నారు. ఒకటి నుంచి ఏడో తరగతి వరకు చదివిన ప్రాంతాన్ని పరిగణనలోకి తీసుకుని స్థానిక, స్థానికేతర అని నిర్ధారిస్తారన్నారు. ఆ మేరకు మెరిట్ జాబితా ప్రకటించి కలెక్టర్ చైర్మన్‌గా ఉండే కమిటీ నియామకాలను పూర్తిచేయాలని మార్గదర్శకాలు జారీ చేశారని పేర్కొన్నారు. ఎంపికైన వారు 2024 ఏప్రిల్ 24 వరకు కాంట్రాక్ట్ విధానంలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. జిల్లాలోని అన్ని ఎమ్మార్సీలు, విద్యాశాఖ నోటీసు బోర్డులో మెరిట్ లిస్ట్ ప్రదర్శిస్తామన్నారు. ఎంపికైన వారు ఎమ్మార్సీల్లో పనిచేయాల్సి ఉంటుందని డీఈవో వివరించారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ప్రతిపాదనలు

జగిత్యాల: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం జిల్లాలోని వివిధ కేటగిరీల్లోని ఉపాధ్యాయులు తమ ప్రతిపాదనలు పంపించాలని డీఈవో జగన్మోహన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. సెప్టెంబర్ 5న నిర్వహించనున్న గురుపూజోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని సన్మానిస్తారన్నారు. ఆసక్తిగల ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో nationalawardstoteachers.education.gov.in తమ వివరాలను నిర్ణీత నమూనాలో ఈనెల 15లోగా అప్‌లోడ్ చేయాలని సూచించారు. హార్డ్‌కాపీలను డీఈవో కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

సారంగాపూర్: బీర్‌పూర్ మండలంలోని తుంగూర్ గ్రామానికి చెందిన సంకుటాల హన్మాండ్లు(62) చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఏఎస్సై రవీందర్ కథనం ప్రకారం.. హన్మాండ్లు గత మే 26న తన ద్విచక్రవాహనంపై వెళ్తూ గ్రామంలోని వాటర్ ప్లాంట్ దగ్గర ఆగివున్న పంచాయతీ ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఆయన తీవ్రంగా గాయపడగా కుటుంబసభ్యులు తొలుత జగిత్యాలలోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడికి భార్య లక్ష్మి ఉంది. మృతుడి అల్లుడు గుండ గంగాధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

చట్టాన్ని అందరూ గౌరవించాలి

పెగడపల్లి: చట్టాన్ని అందరూ గౌరవించాలని సర్పంచి శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. పెగడపల్లిలో శుక్రవారం సివిల్ రైట్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో కులమతాలకు అతీతంగా అందరు సమానంగా జీవించాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సాగర్‌రావు, అంబేడ్కర్ సంఘం నాయకులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కులకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు

మల్లాపూర్: భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను కాల రాస్తే కఠిన చర్యలు తప్పవని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సురేశ్ అన్నారు. మండలంలోని ముత్యంపేట ఎస్సీ కాలనీలో శుక్రవారం పౌర హక్కుల దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. సమాజంలో ప్రతి పౌరుడు రాజ్యాంగం కల్పించిన హక్కులను వినియోగించుకుని సత్ప్రవర్తనతో మెలగాలని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నాగేశ్, సర్పంచ్ బొల్లం కృష్ణవేణి, ఉపసర్పంచ్ అల్లూరి మహేశ్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ప్రజలందరూ ఐకమత్యంగా ఉండాలి

కథలాపూర్: మండలంలోని పెగ్గెర్ల, మేడిపెల్లి మండలం కట్లకుంట గ్రామాల్లో శుక్రవారం సివిల్ రైట్స్ డే నిర్వహించారు. అధికారులు ఎస్సీ కాలనీలో పర్యటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలందరు ఐకమత్యంగా ఉండి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని అధికారులు కోరారు. కార్యక్రమంలో సర్పంచులు జవిడి ప్రతాప్‌రెడ్డి, గడ్డం నారాయణరెడ్డి, అధికారులు, దళిత నాయకులు పాల్గొన్నారు.

కేంద్రం నిధులతోనే వైకుంఠధామాల నిర్మాణం



వైకుంఠధామం వద్ద బీజేపీ నాయకులు

పెగడపల్లి: గ్రామాల్లో వైకుంఠ ధామాలను కేంద్ర ప్రభుత్వ నిధులతోనే నిర్మించారని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి అన్నారు. బీజేపీ నిర్వహిస్తున్న జన సంపర్క అభియాన్‌లో భాగంగా శుక్రవారం పెగడపల్లి మండలంలోని బతికపల్లిలో నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ కర పత్రాలు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో వైకుంఠ ధామం పరిశీలించి మాట్లాడారు. గ్రామ పంచాయతీలకు సమకూరుతున్న నిధుల్లో 80 శాతం కేంద్ర ప్రభుత్వ నిధులేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కొమురెల్లి, మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అనసూర్య, నాయకులు నరేందర్, కిషోర్, రవీందర్‌రెడ్డి, రమేశ్, మల్లేశ్, పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి కేంద్రం కృషి

జగిత్యాలరూరల్: దేశంలో పేదల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, ఇందుకోసం అనేక పథకాలు ప్రవేశపెడుతోందని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జగిత్యాల రూరల్ మండలంలోని మోరపల్లిలో నిర్వహించిన మహాజన్ సంపర్క్ అభియాన్‌లో మాట్లాడుతూ.. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని తెలిపారు. అనంతరం ఉత్తమ రైతులను సన్మానించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి, రైతు నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు కర్నె నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి తూకుంట్ల రాంరెడ్డి, నాయకులు మల్లేశం, శ్రీనివాస్, వెంకటరెడ్డి, మల్లయ్య, రమేశ్, గంగాధర్, అజయ్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

కథలాపూర్: బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పార్టీ పరిశీలకులు జశ్వంత్, విస్తారక్ అన్నారు. శుక్రవారం కథలాపూర్, మేడిపెల్లి మండలాల్లో మేరా బూత్ సబ్సే మజ్బూత్ కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను గడప గడపకు చేరేలా బీజేపీ నాయకులు, కార్యకర్తలు కరపత్రాలు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ క్యాతం దశరథంరెడ్డి, మండలాధ్యక్షుడు ముంజ శ్రీనివాస్‌గౌడ్, కంటె సత్యనారాయణ, నాయకులు విజయ్‌రావు, జలపతిరెడ్డి, ఎస్ఎన్ రెడ్డి పాల్గొన్నారు.

గడప గడపకూ బీజేపీ

ఇబ్రహీంపట్నం: మండలంలోని తిమ్మాపూర్‌లో 13, 14 బూత్‌లలో శుక్రవారం మహజన్ సంపార్క్ అభియాన్‌లో భాగంగా నరేంద్రమోదీ 9 ఏళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి పథకాలపై బీజేపీ నాయకులు ప్రచారం చేశారు. గడపగడపకు వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి కరపత్రాలు పంపిణీ చేసి వివరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బట్టు జకరయ్య, ప్రధాన కార్యదర్శి వై.బాలు, ఉడత రాజు, పుప్పాల నాగేశ్, మాలేపు శ్రీనివాస్, ఇల్లెందుల చారి, దళితమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిరుపేద మహిళలకు సామాజిక మిత్రుల చేయూత

ధర్మపురి: క్యాన్సర్ వ్యాధి సోకి ఒకరు, రెండు కిడ్నీలు చెడిపోయి మరొకరు బాధపడుతూ వైద్యానికి, మందుల ఖర్చులకు ఇబ్బందులు పడుతున్న మహిళలకు సామాజిక మిత్రులు రూ. 1.21 లక్షలు సాయం అందించి అండగా నిలిచారు. ధర్మపురికి చెందిన నిరుపేద మసీదు లక్ష్మి ఏడాది క్రితం క్యాన్సర్ వచ్చి మందులకు సైతం డబ్బులు లేక ఇబ్బంది పడుతోంది. బుగ్గారం మండలం యశ్వంతరావ్‌పేటకు చెందిన బోయిని చిన్న లక్ష్మి అనే వృద్ధురాలికి ఏడాది క్రితం రెండు కిడ్నీలు చెడిపోవడంతో దాతల సాయం కోసం ఎదురుచూస్తోంది. ధర్మపురికి చెందిన సామాజిక సేవకుడు రేణికుంట రమేశ్ దాతలు సాయం చేయాలని ఫేస్‌బుక్‌లో పోస్టు చేయడంతో స్పందించిన దాతలు రూ. 1.21 లక్షలు సాయం అందించారు. రమేశ్ వాటిని సీఐ రమణమూర్తి చేతుల మీదుగా క్యాన్సర్ బాధితురాలు లక్ష్మికి రూ. 75 వేలు, చిన్న లక్ష్మికి రూ. 46 వేలు అందజేశారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి



గ్రూప్ 4 అభ్యర్థులతో మాట్లాడుతున్న భోగ శ్రావణి

జగిత్యాలటౌన్: యువత ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి తమ లక్ష్యం చేరుకోవాలని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి సూచించారు. శుక్రవారం స్థానిక మల్లేశం అకాడమీలో గ్రూప్–4 శిక్షణ పొందుతున్న అభ్యర్థులను కలిసి శుభాకాంక్షలు తెలిపి మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం శ్రావణి మాట్లాడుతూ, శనివారం జరిగే గ్రూప్– 4 పరీక్షల్లో మంచిమార్కులు సాధించి ఉద్యోగాలు పొందాలన్నారు. జీవితంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. కాగా, పట్టణంలోని 12వ వార్డులో జరిగిన ఛాయ్‌పే చర్చ కార్యక్రమంలో భోగ శ్రావణి పాల్గొన్నారు. వార్డు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

'రాజకీయ భిక్ష పెట్టింది బీఆర్ఎస్'



మాట్లాడుతున్న చంద్రశేఖర్‌గౌడ్

జగిత్యాలటౌన్: వ్యక్తిగత దూషణలతో రాజకీయంగా ఎదగలేవని, రాజకీయ భిక్ష పెట్టింది బీఆర్ఎస్ పార్టీ అనే విషయం మరువరాదని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గొల్లపల్లి చంద్రశేఖర్‌గౌడ్ అన్నారు. బీజేపీ నాయకురాలు భోగ శ్రావణి వ్యాఖ్యలను ఆయన ఖండించారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయాల్లో కొత్తగా అడుగుపెట్టిన భోగ శ్రావణి.. వ్యక్తిగత దూషణలతో జగిత్యాలలోని దశాబ్దాల రాజకీయ వాతావరణాన్ని కలుషితం చేస్తున్నారని విమర్శించారు. మరీ ముఖ్యంగా భోగ శ్రావణి కేవలం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ టార్గెట్‌గా వ్యక్తిగత విమర్శలకు దిగడం ఆమె దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, రాజేశంగౌడ్, రమణ లాంటి సీనియర్ నాయకులు ఏనాడూ వ్యక్తిగత విమర్శలకు దిగలేదని గుర్తుచేశారు. నిజామాబాద్ ఎంపీ వ్యక్తిగత దూషణల దురలవాటును శ్రావణి కొనసాగించడం బాధాకరమన్నారు. బీఆర్ఎస్ నాయకులు బాల ముకుందం, కచ్చు లత, శ్రీమంజరి, గంగాధర్, తిరుపతి, సతీశ్, గంగారాం, ప్రకాశ్ తదితరులు ఉన్నారు.

క్రైం కార్నర్..

కుక్కల దాడిలో ఇద్దరికి గాయాలు

కథలాపూర్: చింతకుంట గ్రామానికి చెందిన తాలుక కొమురయ్య అనే రైతుపై శుక్రవారం మధ్యాహ్నం కుక్కలు దాడి చేసి, గాయపరిచినట్లు గ్రామస్తులు తెలిపారు. కొమురయ్య తన పొలం వద్దకు వె ళ్తుండగా దుర్గామాత దేవాలయం వద్ద శునకా లు గుంపుగా వచ్చి, దాడి చేశాయన్నారు. బాధితుడిని అంబులెన్స్‌లో జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

మెట్‌పల్లిలో మరొకరు..

మెట్‌పల్లి: పట్టణంలోని కళానగర్‌కు చెందిన రాగుల సత్యనారాయణ శుక్రవారం కు క్కల దాడిలో గాయపడ్డాడు. ఆయన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వెంబడించి, దాడి చేశాయని స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో బాధితుడి కాలికి గాయాలయ్యాయి.

కాపర్ వైరు చోరీ

మెట్‌పలి: పట్టణంలోని విద్యుత్ ట్రా న్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రంలో కాపర్ వైరు చోరీకి గురైంది. విషయం తెలుసుకున్న ఎస్ఈ శ్రీనివాస్ శుక్రవారం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రంలో నిల్వ ఉంచిన సుమారు రూ.1.80 లక్షల విలువైన కాపర్ వైరు చోరీకి గురైందని తెలిపారు. మెట్‌పల్లి డివిజన్‌లో మూడు నెలల్లో 18 ట్రాన్స్‌ఫార్మర్లు ఎత్తుకెళ్లారని, సంస్థకు రూ.4 లక్షల నష్టం వాటిల్లిందన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ లక్ష్మీనారాయణ, ఎస్సై శ్యామ్‌రాజ్ ఘటనాస్థలికి వెళ్లి, పరిశీలించారు.

సంక్షిప్త వార్తలు

లయన్స్ క్లబ్ సేవలు మరింత విస్తరించాలి

రాయికల్: రాయికల్‌లో లయన్స్ క్లబ్ సేవలను మరింత విస్తరించాలని గవర్నర్ రిక్కల నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం రాయికల్ ప్ర భుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు గుండె పరీక్షల ప్రా థమిక నిర్ధారణ నిమిత్తం రూ.50 వేల విలువైన ఈసీజీ మెషిన్‌ను, రూ.1.20 లక్షల విలువైన 67 సిమెంట్ బెంచీలను అందజేశారు. మున్సిపల్ చైర్మ న్ మోర హన్మాండ్లు, వైస్ చైర్‌పర్సన్ రమాదేవి, డీసీ లు మ్యాకల రమేశ్, కాటిపల్లి రాంరెడ్డి, బత్తిని భూమయ్య, అధ్యక్షుడు ఎద్దండి దివాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రంజిత్, కోశాధికారి కడకుంట్ల నరేశ్ పాల్గొన్నారు.

జూలై 6 నుంచి నిరవధిక సమ్మె నోటీసు

సారంగాపూర్: గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులు తమ సమస్యలను జూలై 5 లోపు పరిష్కరించకపోతే జులై 6 నుండి నిరవధిక సమ్మెలో పాల్గొంటామని శుక్రవారం సారంగాపూర్ ఎంపీడీవో, ఎంపీవోలకు సమ్మె నోటీసులు అందజేశారు. గ్రామపంచాయతీల్లో మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా పోరాటం చేస్తున్నా.. ప్రభుత్వం నుంచి జూలై 5లోపు సానుకూల ప్రకటన రాకపోతే తాము నిరవధిక సమ్మెకు వె ళ్తామని ఎంపీడీవో రాజేందర్, ఎంపీవో శశికుమార్‌రెడ్డిలకు సమ్మె నోటీసులు అందించారు. కార్యక్రమంలో సంఘ బాధ్యులు పులి మల్లేశం, మామిడిపెల్లి రాజేందర్, గోవర్ధన్ శ్రీకాంత్, రంజిత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కల ధ్వంసంపై పోలీసులకు ఫిర్యాదు

మెట్‌పల్లి: మండలంలోని రాంలచ్చక్కపేట ప్రకృతి వనంలో మొక్కలను దుండగులు ధ్వంసం చేశారు. హరితహారంలో భాగంగా ప్రకృతి వనంలో సుమారు 800 మొక్కలను పెంచుతున్నారు. వీటిని జగ్గాసాగర్‌కు చెందిన కొందరు వ్యక్తులు ధ్వంసం చేశారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామ కార్యదర్శి సోని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కార్మికులకు సన్మానం

జగిత్యాలఅగ్రికల్చర్: గత 30 ఏళ్లుగా పొలాస వ్యవసాయ పరిశోధన స్థానంలో కార్మికులుగా పనిచేసి పదవివిరమణ పొందుతున్న కార్మికులు బుచ్చమ్మ, భూమక్క, గంగారాంను వ్యవసాయ శాస్త్రవేత్తలు శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ పరిశోధన స్థానంలో కార్మికులు చేసిన సేవలు ఆదర్శప్రాయమన్నారు. వారిని ఆదర్శంగా తీసుకుని ప్రతీ ఒక్కరు పరిశోధన స్థానం అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏవో దేవయ్య, ఏసీ పురుషోత్తం, వ్యవసాయ శాస్త్రవేత్తలు, కాంట్రాక్ట్ వర్కర్స్, నాన్‌టీచింగ్ సిబ్బంది, టైమ్‌స్కేల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బుచ్చిరాజు సేవలు మరువలేనివి

మల్లాపూర్: బీసీ హాస్టల్ కమాటిగా బుచ్చిరాజు సేవలు మరువలేనివని జిల్లా సంక్షేమశాఖ అధికారి సాయిబాబా అన్నారు. శుక్రవారం మల్లాపూర్ బీసీ హాస్టల్ కమాటి బుచ్చిరాజును సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 ఏళ్లుగా బీసీ హాస్టల్‌లో కమాటి బాధ్యతలు చేపట్టిన బుచ్చిరాజు వృత్తి పట్ల నిబద్ధత, అంకితభావంతో విధులు నిర్వర్తించారన్నారని కొనియాడారు. అనంతరం పదవీవిరమణ చేస్తున్న బుచ్చిరాజును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ జయరాజ్, బీసీ వార్డెన్ గుగ్లావత్ బన్సినాయక్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'నకిలీ విత్తనాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి'

మెట్‌పల్లి: మార్కెట్‌లో నకిలీ విత్తనాల నియంత్రణకు అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే కొమొరెడ్డి జ్యోతక్క శుక్రవారం కోరారు. మెట్‌పల్లి ప్రాంతంలో వరి, మొక్కజొన్న పంటలను ఎక్కువగా సాగు చేస్తారని, కానీ మార్కెట్‌లో నాణ్యమైన విత్తనాలు దొరకక రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం పూర్తి విఫలమైందన్నారు. నకిలీ విత్తనాల వల్ల దిగుబడి రాక రైతులు నష్టపోయే అవకాశముంటుందన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా చొరవ తీసుకోవాలన్నారు.

పోస్టాఫీసులో ఆధార్ సేవలు వినియోగించుకోండి

కథలాపూర్: పోస్టాఫీసులో ఆధార్ నమోదుకు అవకాశం ఉందని, ప్రజలు వినియోగించుకోవాలని పోస్టల్ ఇన్‌స్పెక్టర్ శ్రావణ్‌కుమార్ కోరారు. శుక్రవారం కథలాపూర్‌లో పోస్టల్‌శాఖ ఆధ్వర్యంలో ఆధార్ మేళా నిర్వహించారు. కొత్తగా ఆధార్ నమోదు, ఆధార్ కార్డులోని తప్పుల సరి, మార్పులు, చేర్పులు చేసుకునే అవకాశం కల్పించారు. కార్యక్రమంలో పోస్టల్ మెయిలర్ అంజయ్య, బీపీఎంలు రాజేందర్, రాజేశ్, జ్ఞానేశ్వర్, సౌజన్య, రాజ్‌కుమార్, కార్తీక్, జలందర్ పాల్గొన్నారు.

నూతన నియామకం

కోరుట్ల: బీజేపీ యువ మోర్చా పట్టణ అధ్యక్షుడిగా కలాల సాయిచంద్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం పట్టణ బీజేపీ అధ్యక్షుడు దాసరి రాజశేఖర్ సాయిచంద్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. తన నియామకానికి కృషి చేసిన ప్రతీ ఒక్కరికి సాయిచంద్ కృతజ్ఞతలు తెలిపారు.